# దరఖాస్తులను పరిష్కరించాలి

◆మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్20 ప్రభాతవార్త:** భూ సమస్యల పై భూ భారతి రెవెన్యూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తులు నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులకు సూచించారు. శుక్రవారం అడ్డాకుల్ మండలం గుడి బండ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు కలెక్టర్ హాజరై అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలను స్వయంగా వివరాలుఅడిగి తెలుసుకున్నారు. భూ సమస్యల పరిష్కార వేదికలుగా రెవెన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల వివరాల నమోదులో ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. స్వీకరించిన దరఖాస్తులకు రసీదులు అందించాలని, సంబంధిత రిజిస్టర్లలో తప్పని సరిగా వివరాలు నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ నమోదు రిజిస్టర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. సమస్యల వారీగా అర్జీలను విభజిస్తూ, పక్కాగా రికార్డులను పొందుపర్చాలని అన్నారు. తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించదగిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అన్నారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, పూర్తి రికార్డుల ఆధారంగానే వాటిని పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

## సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణపై సమీక్ష

◆ భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తిచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి

◆ తెలంగాణ వనమహోత్సవం కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలి

◆ నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్20 ప్రభాతవార్త:** జిల్లాలో చేపట్టే భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తిచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలను నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లోని జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు, తెలంగాణ వనమహోత్సవం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, ఉద్యాన పంటలపై, ఆయా శాఖల అధికారులతో నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూజిల్లాలో కొనసాగుతున్న ప్రాజెక్టులకు కావలసిన భూసేకరణను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి శుక్రవారం సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ సమావేశంలో సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన భూముల స్వాధీనం ప్రక్రియపై జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రైతులకు నష్టపరిహార పంపిణీ, భూస్థలాల నమోదుల ప్రక్రియ, ప్రాజెక్టుల నిర్మాణానికి భూసేకరణలో ఆలస్యం కాకుండా చూస్తూ సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు.జిల్లాలో వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టి అందుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్ శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అంటు వ్యాధుల నివారణకు సంబంధించి ముందస్తుగా మందుల నిల్వ, వైద్య బృందాల సన్నద్ధత, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సామర్థ్యాన్ని పెంచే చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. అలాగే పంచాయతీరాజ్‌శాఖ అధికారులు గ్రామాల్లో శుభ్రత కార్యక్రమాలను గణనీయంగా చేపట్టాలని, డ్రైనేజీ, కేటి కుళాయిలు, మురుగు నీటి కాలువలు వంటి అంశాల్లో నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. తెలంగాణ వనమహోత్సవం కార్యక్రమం సందర్భంగా జిల్లాలో పచ్చదనం పెంపుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులకు సూచించారు. మొక్కలు నాటే కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మొక్కల ఎంపిక, నర్సరీలో ఉన్న మొక్కలగుర్తింపు, గ్రామాల్లో గుర్తించిన ప్రదేశాల్లో మొక్కల వినియోగం, విస్తృతంగా ప్రజల భాగస్వామ్యం తదితర అంశాలపై సమగ్రంగా కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. గ్రామస్థాయి నుండి పట్టణ ప్రాంతాల వరకు మొక్కలునాటే కార్యక్రమాలను వ్యవస్థాత్మకంగా అమలు చేయాలని ఆయన స్పష్టం చేశారు.ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో సాగు చేస్తున్న పంటలపరిస్థితిని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ -మిగతా4లో..

## మార్కెట్ గోడౌన్‌కు స్థల పరిశీలన

**వనపర్తి ప్రతినిధి, జూన్ 20 ప్రభాతవార్త:** కొత్తకోట మండలం చెర్లపల్లిలో రేషన్ దుకాణం మార్కెట్ గోడౌన్ కు అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు స్థల పరిశీలన చేశారు. శుక్రవారం కొత్తకోట మండలం చెర్లపల్లి గ్రామంలో చౌక ధర దుకాణాన్ని అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ దుకాణంలో పంపిణీ అవుతున్న బియ్యం నాణ్యతను స్వయంగా పరిశీలించారు. రేషన్ లబ్ధిదారులతో నేరుగా మాట్లాడిన ఆయన రేషన్ సరుకులు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల నుండి వచ్చిన అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. పంపిణీలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం, చెర్లపల్లి గ్రామ పరిధిలోని మార్కెట్ గోడౌన్ నిర్మాణం కోసం ఉద్దేశించిన స్థలాన్ని అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ పరిశీలనలో స్థానిక తహశీల్దార్ వెంకటేశ్వర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

## మహబూబ్‌నగర్‌ను ఎడ్యుకేషనల్ హబ్‌గా మారుస్తాం

◆ ప్రభుత్వ, ప్రైవేటు సమాంతరంగా అభివృద్ధి చెందాలి

◆ మహబూబ్‌నగర్‌కు బహుమతిగా ఐఐఐటి కళాశాల ఇచ్చిన సీఎం

◆ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

◆ అట్టహాసంగా మహతి పాఠశాల ప్రారంభోత్సవం

◆ హాజరైన జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి





మహతి పాఠశాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు శ్రీనివాస్ రెడ్డి, అనిరుద్ రెడ్డి, పాఠశాల యాజమాన్యం

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్20 ప్రభాతవార్త:** ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలు సమాంతరంగా అభివృద్ధి చెందాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ నగరపాలక పరిధి లోని తిరుమల హిల్స్ లో ప్రతిభ విద్యాసంస్థలు వారి మహంతి పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డితో పాటు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన మహబూబ్ నగర్ కు ఎలాంటి వనరులు లేవని మనకు ఉన్న ఏకైక వనరులు మన జ్ఞానమే అని ఆయన చెప్పారు. మహబూబ్‌నగర్‌ను ఎడ్యుకేషనల్ హబ్‌గా అభివృద్ధి చేయాలనే సంకల్పం మాకే కాదు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉందన్నారు. అందుకే మన మహబూబ్‌నగర్‌కు ఐఐఐటి కళాశాలను బహుమతిగా ఇచ్చారన్నారు. మహబూబ్‌నగర్‌ను అన్ని రంగాల్లో మొదటి స్థానంలో నిలపాలనే ఆలోచన ఎమ్మెల్యేలకే కాదు సామాన్య పౌరుడికీ ఉండాలని ఆయన స్పష్టం చేశారు. అకుంఠిత దీక్షతో పనిచేస్తే ఏదైనా సాధ్యమే అని ఆయన చెప్పారు. మన ఆలోచనల్లో మార్పు రావాలన్నారు. మన మహబూబ్ నగర్ పిల్లలు ఆల్ రౌండ్ డెవలప్‌మెంట్ సాధించాలని ఆయన ఆకాంక్షించారు. చదువుతో పాటు కళలు, సాహిత్యం, క్రీడలలో మన మహబూబ్ నగర్ పిల్లలు రాణించాలని ఆయన అన్నారు. ప్రతిభా జూనియర్ కళాశాల విద్యార్థిని మంజుశ్రీ నీట్ ఎంట్రెన్స్ నందు ఆల్ ఇండియాలో 1902 ర్యాంకుసాధించిన సందర్భంగా ఎమ్మెల్యే ఘనంగా సన్మానించి అభినందించారు.అంతకు ముందు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ చదువు మీద ప్రత్యేక శ్రద్ధను మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చూపిస్తున్నారని, ముఖ్యమంత్రితో చర్చించి ఒప్పించి మహబూబ్‌నగర్ జిల్లాకు ఐఐఐటి కళాశాల రావడానికి ప్రధాన భూమిక పోషించారని ఆయన చెప్పారు .కార్యక్రమంలో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, ఐఎన్టీ యుసి రాములు యాదవ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ జాజి మొగ్గ నర్సింహులు, మహతి పాఠశాల చైర్మన్ మంజుల దేవి, డైరెక్టర్లు వేంకటేశ్వర రెడ్డి, జనార్ధన్ రెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

## క్రీడల్లోనూ నెంబర్ వన్‌గా నిలవాలి

● క్రీడా స్ఫూర్తికి ప్రతీక ఒలింపిక్ రన్

● ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

● 39వ ఒలింపిక్ డే రన్ 2025 ప్రారంభం

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 20 ప్రభాతవార్త:** మన మహబూబ్‌నగర్ చదువులతో పాటు ఆటలలో కూడా తెలంగాణలోనే మొదటి స్థానంలో ఉండాలి అని ఆలోచన చేస్తున్నానని దీనికి పట్టణ ప్రజలు,అధికారులు, స్పోర్ట్స్ లవర్స్ వీళ్ళందరూ కూడా ముందుండి క్రియాశీలకంగా పని చేయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని నింపడానికి ఎన్నో సంవత్సరాలుగా ఈ ఒలింపిక్ రన్ నిర్వహిస్తున్నారని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 39వ ఒలింపిక్ డే రన్ 2025 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జిల్లా క్రీడా మైదానం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు జరిగిన ఒలింపిక్ రన్‌లో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహబూబ్ నగర్ జిల్లాలోని క్రీడాభిమానులు బాల బాలికల్లో క్రీడల పట్ల ఆసక్తిని పెంచడానికి ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకొని స్పోర్ట్స్ కార్యక్రమాలు ఎట్లా పెంపొందించాలి దానికి ఏమేమి కావాలి అని రిపోర్ట్ తీసుకోని నాకు ఇస్తే ఖచ్చితంగా వాటికి సంబంధించిన అవసరాలు అన్నిటిని కూడా తీర్చడానికి సిద్ధంగా ఉన్నానని ఆయన హామీ ఇచ్చారు. ఒలంపిక్ రన్ చేయడమే కాదు దీని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను క్రీడలపైన శ్రద్ధ చూపించే విధంగా ప్రయత్నం చేయాలని అదే మన లక్ష్యం అని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి 2036 వరకు మన రాష్ట్రాల నుంచి ఒలంపిక్ -మిగతా4లో..





జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

## అకృత్యం.. అమానవీయం..

◆ ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం

◆ కడుపు నొప్పితో దావఖానకు చేరడంతో వెలుగులోకి..

◆ జడ్చర్ల మండలంలో ఘటన



**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 20 ప్రభాతవార్త:** ఎనిమిదేళ్ల బాలికపై గుర్తు తెలియని వ్యక్తి అత్యాచారం చేసిన అమానవీయ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే తీవ్ర అస్వస్థతకు గురైన చిన్నారి జిల్లా ఆస్పత్రిలో బాలిక చికిత్స పొందుతుంది. జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్ట్ పోలీస్ సిబ్బంది జడ్చర్ల పోలీసులకు సమాచారం అందించడంతో ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన జడ్చర్ల మండలంలో తీవ్ర కలకలం రేపుతుంది. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ జానకి జడ్చర్ల పోలీస్ స్టేషన్‌కు చేరుకుని విచారణ చేపడుతున్నారు. జడ్చర్ల మండలంలోని ఒక గ్రామానికి చెందిన 8 ఏళ్ల బాలికకు అనారోగ్యం,వాంతులు అవుతుండడంతో బుధవారం బాలికను 108 సహాయంతో తల్లి మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. బాలికకు చికిత్స అందిస్తున్న జిల్లా ఆసుపత్రి వైద్యులు బాలికపై గత రెండు మూడు రోజుల క్రితం అత్యాచారం జరిగినట్లు అనుమానిస్తూ ఆస్పత్రి అవుట్ పోస్ట్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు జడ్చర్ల పోలీసులకు సమాచారం అందించగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న జడ్చర్ల పోలీసులు రంగంలోకి దిగి ఘటనపై విచారణ చేపడుతున్నారు. బాలిక తీవ్ర జ్వరంతో పాటు రక్తస్రావం కావడాన్ని గమనించిన తల్లి ఇంటి వద్దనే రెండు రోజుల పాటు ఉంచుకున్నట్లు సమాచారం. అయినా కూడా జ్వరం తగ్గడంతో వాంతులు కావడంతో బాలికను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. ఈ క్రమంలోనే అక్కడి వైద్యులు పోలీసులకు సమాచారం అందించారు. కాగా మండల పరిధిలో ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం జరిగిన ఘటన మండలంలో తీవ్ర కలకలం రేగింది. ఈ ఘటన సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ జానకి జడ్చర్ల పోలీస్ స్టేషన్‌కు చేరుకొని ఈ ఘటనపై పట్టణ సీఐ కమలాకర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కేసు విచారణ అత్యంత వేగంగా చేపట్టాలని నిందితుడు ఎంతటి వాడైనా శిక్ష నుండి తప్పించుకోవడానికి వీల్లేదని ఘటనకు సంబంధించిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.

## ఎస్సీ ఎస్టీల పై దౌర్జన్యాలకు పాల్పడితే కఠినంగా శిక్షించాలి

◆వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి ప్రతినిధి, జూన్ 20 ప్రభాతవార్త:** ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాలు, దౌర్జన్యాలకు పాల్పడిన వారికి కఠినంగా శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన మొదటి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తప్పు చేసిన వారికి చట్టం ప్రకారం ఖచ్చితంగా శిక్ష పడాలని బాధితులకు న్యాయం జరగాలన్నారు. ఒకవేళ తప్పుడు కేసులు నమోదు చేస్తే విజిలెన్స్ కమిటీ సభ్యులు నచ్చచెప్పి కేసు ఉపసంహరించుకునే విధంగా చూడాలని కలెక్టర్ సూచించారు.తప్పుడు కేసులు పెట్టడం, తప్పు చేసినప్పటికీ శిక్ష పడకుండానే బయట రాజీ పడిపోవడం వల్ల చట్టం నీరుగారిపోతుందని తెలియజేశారు. ఎక్కడైతే ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు అవుతున్నాయో అది ఏ ప్రాంతంలో జరుగుచున్నాయి, ఎలాంటి కేసులు నమోదు అవుతున్నాయి అనే విషయాలు నిశితంగా గమనించి నివేదిక రూపొందిస్తే అట్టి ప్రాంతం పై ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించవచ్చు నని పోలీస్ శాఖను ఆదేశించారు. ప్రతి నెల 30వ తేదీన నిర్వహించే పౌర హక్కుల దినోత్సవం ఏ గ్రామంలో ఎక్కడ జరగనున్నదో ముందుగానే షెడ్యూల్ రూపొందించి కమిటీ సభ్యులకు, అధికారులకు ఇవ్వడం జరిగిందని, షెడ్యూల్ ప్రకారం పోలీస్ అధికారులు, రెవెన్యూ అధికారులు, విజిలెన్స్ కమిటి సభ్యులు వెళ్ళి హాజరు కావాలని సూచించారు.పౌర హక్కుల దినోత్సవం కార్యక్రమాన్ని అర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.ఎస్సీ ఎస్టీలకు ఎక్కడైనా అస్పృశ్యత వంటి సమస్యలు దృష్టికి వస్తె విజిలెన్స్ కమిటి సభ్యులు, పోలీస్ సిబ్బంది, అధికారులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులుఆ గ్రామానికి వెళ్లి అవగాహన కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ చట్టంలోని షెడ్యూల్ 3 పై కమిటీ సభ్యులకు, స్వచ్ఛంద సంస్థల సభ్యులకు ఒక అవగాహన కార్యక్రమం నిర్వహించాలని ఈడి ఎస్సీ కార్పొరేషన్ అధికారిని ఆదేశించారు. సమావేశంలో సమీక్ష సందర్భంగా డి.ఎస్.పి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2023 నుండి ఇప్పటివరకు వనపర్తి జిల్లాలో 58 ఎస్సీ, 10 ఎస్టి మొత్తం 68 అట్రాసిటీ కేసులు నమోదయాయని కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. వీటిలో బాధితులకు మొదటి దశలో 48 మందికి చట్టం ప్రకారం నష్టపరి హారం రూ.27,2000లు మంజూరు చేసి ఇవ్వడం జరిగిందని, రెండవ దశలో 25 మందికి 40 లక్షల రూపాయలు పరిహారంగా ఇవ్వడం జరిగింది అన్నారు 21 మందికి మంజూరు కాలేదని నివేదిక సమర్పించారు. 59 కేసుల్లో చార్జి షీట్ ఫైల్ చేసినట్లు తెలిపారు. అదే విధంగా 108 పి.టి కేసులు నమోదు అయ్యాయని వివరించారు. జిల్లా సంక్షేమ శాఖ ద్వారా జిల్లాలో 2024నుండి ఎస్సీ ఎస్టీ 26 పోక్సో కేసులు నమోదు అయ్యాయని, వాటిలో 17 కేసులకు రూ. 6,50,000లు పరిహారంగా అందజేయడం జరి గిందని కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన జిల్లా కలెక్టర్ పరిహారం రావాల్సిన ప్రతి ఒక్కరికి పరిహారం ఇచ్చే విధంగా ఎస్సీ ఎస్టీ కమిషన్ కు నిధులు మంజూరు చేసేందుకు ప్రతిపాదనలు పంపించాలని రెవెన్యూ అధికా రులను ఆదేశించారు.విజిలెన్స్ కమిటి సభ్యుడు ఎడవల్లి వీరప్ప మాట్లాడుతూ బుడగ జంగం వారి పై దాడులు జరుగుచున్నాయని, ముమ్మాలపల్లి, గోపాల్ పేట మండలం చాకల్ పల్లిలో బుడగ జంగం వారికి బెదిరించడం, రచ్చకట్ట పై కూర్చోకుండా చేయడం వాటి దౌర్జన్యాలు జరుగుచున్నాయన్నారు. స్పందించిన కలెక్టర్ బెదిరించే వారిపై కేసులు నమోదు చేసి తన దృష్టికి తీసుకురావాలని అదే విధంగా కమిటీ సభ్యులు వెళ్ళి బుడగ జంగాల ప్రజలకు ధైర్యం చెప్పాలనీ సూచించారు. బుడగ జంగం విద్యార్థులకు ఎవరికైన హాస్టల్ వసతి, పాఠశాలలో సీటు కావాలంటే తన దృష్టికి తీసుకురావాలని -మిగతా4లో..



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, హాజరైన సంబంధిత అధికారులు

## యూనిట్ ఫార్మర్ ఐడీ తప్పనిసరి

● భూమి ఉన్న ప్రతి రైతు నమోదు చేసుకోవాలి

● ప్రభుత్వ పథకాల ఫలాలు రైతులకే నేరుగా చేరే అవకాశం

● డిఎఓ జాన్ సుధాకర్

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 20 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం దేశంలోని రైతుల కోసం నూతనంగా ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని చేపట్టింది. భూమి అన్న ప్రతి రైతుకు ఆధార్ కార్డు తరహాలో 14 అంకెలతో కూడిన విశిష్ట సంఖ్యను కేటాయించనున్నారు. దీనిని యూనిట్ ఫార్మర్ ఐడీ అని పిలుస్తారు. దీని ద్వారా రైతులకు సంబం ధించిన అన్ని వివరాలను డిజిటల్ రూపంలో ఒక దగ్గర భద్రప రుస్తామని అధికారులు అంటున్నారు. ప్రభుత్వ పథకాల అమలును మరింత సమర్థవంతంగా నిర్వహించాలనే ముఖ్య ఉద్దేశంతో ఈ ప్రాజెక్టును రూపొందించనట్లు తెలుస్తుంది. మరిన్ని వివరాలు -మిగతా4లో..



మాట్లాడుతున్న డిఎఓ జాన్ సుధాకర్

## ఆసనం వ్యసనమైతే ఆరోగ్యం పదిలం

● నేడు 11వ ప్రపంచ యోగా దినోత్సవం

**నారాయణపేట ప్రతినిధి, జూన్20 ప్రభాతవార్త:** యోగా.. ఈ పేరు వింటేనే ఓ విధమైన మానసిక ఉల్లాసం మనసును తట్టి లేపుతుంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం.. ఆధునిక వైద్య విధానం ఎన్నో పుంతలు తొక్కుతున్న నేటి కాలంలో అంతకుమించి ప్రాచుర్యం పొందుతోంది యోగా. ఎందుకంటే దానికి అంతటి మహాత్యం ఉంది కాబట్టి. పూర్వకాలంలో, వేద కాలంలో ఆచరణలో ఉన్న ఈ యోగ నేడు మళ్ళీ ప్రపంచపు వెలుగులోకి వచ్చింది. భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు, ఆయుర్వేద రంగాలకు ప్రతిబింబంగా యోగ మరోసారి తన విశిష్టతను వివరిస్తుంది. మరుగున పడిపోయిన ఈ యోగా పరమార్థాన్ని ప్రపంచానికి తెలియజేసిన యోధుడు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అని చెప్పక తప్పదు. 2014,మే 26న ప్రధానమంత్రిగా ప్రమాణం చేసిన నరేంద్ర మోడీ అదే సంవత్సరం సెప్టెంబర్ 27నఐక్యరాజ్యసమితిలో యోగా గొప్పతనాన్ని వివరించారు. ప్రతి ఒక్కరికి ఆరోగ్యాన్ని.. ఆయుష్షును.. ఆనందాన్ని.. ఉల్లాసాన్ని.. ఉత్సాహాన్ని.. చురుకుతనాన్ని పెంచే విశేషాలు అద్భుతంగా అవగాహన చేశారు. అయితే ఆ సమావేశానికి హాజరైన 193 దేశాల ప్రతినిధులలో 175 మంది ప్రతినిధులు యోగా తీర్మానానికి మద్దతుగా నిలిచారు. ఆ తర్వాత 2014 చివర్లో యోగా డేకు ఆమోదం పొంది, 2015 జూన్ 21న యోగా ప్రపంచ దినోత్సవం గా ప్రాచుర్యం పొందింది. రెండవ దశాబ్దంలోకి అడుగుపెట్టిన యోగా దినోత్సవం ప్రస్తుతం 11వ యోగ దినోత్సవాన్ని ప్రపంచం విజయవంతంగా నిర్వహిస్తోంది. "మనసును.. శరీరాన్ని సమతుల్యం చేస్తూ, ఆరోగ్యాన్ని అదుపులో ఉంచే ఏకైక శక్తి యోగాకు మాత్రమే ఉన్నది" అని ప్రపంచ పరిశోధకులు కూడా గుర్తించిన విషయం మనందరికీ తెలిసినదే. "ఇది మతపరమైన లేక మరో విధాన పరమైన అంశానికి సంబంధించినది కాదు" అనే విషయం ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకోవాలి. ఆధ్యాత్మికతకు, ప్రశాంతతకు, ఆరోగ్యానికి మూలం యోగా. మతమేదైనా, కులమేదైనా యోగా ద్వారా ఆత్మను,శరీరాన్నిశుద్ధి చేసుకోవచ్చు. యోగా అనేది ఐక్యతకు నిదర్శనంగా భావించవచ్చు. ఒకరిని మరొకరితో కలుపుకొని జీవించే వసుధైక కుటుంబానికి నిలువెత్తు -మిగతా4లో..



# కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమ ప్రభుత్వం

● గత పాలకులు పేదలను విస్మరించారు

● మక్తల్ నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు

● అమరచింత మండలానికి 500 ఇండ్లు మంజూరు చేస్తా

● రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, క్రీడల యువజన శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి

**అమరచింత జూన్ 20, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీల మేరకు అమలు చేస్తూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, క్రీడల యువజన శాఖ మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి పదవి బాధ్యతలు స్వీకరించి మొదటిసారిగా అమరచింత మండలానికి విచ్చేసిన రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బాణాసంచా తో పాటు భజంత్రీల మధ్య ఘన స్వాగతం పలికారు. అనంతరం రాజీవ్ గాంధీ చౌరస్తాలో పోలీసులు ఏర్పాటుచేసిన గౌరవ వందనని రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి స్వీకరించారు. అనంతరం పట్టణంలో రాజీవ్ గాంధీ విగ్రహానికి, పూలమాలలు వేసి పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తూరాజవాలి దర్గా,మార్కండేయలయం,ఎంబి చర్చి, దర్శించుకున్నారు. అనంతరం భగత్ సింగ్, భారత రాజ్యాంగ నేత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు పూలమాలలు వేశారు. వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరికి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జడ్పిహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, గత 10 ఏండ్ల టిఆర్ఎస్ పాలనలో పేదలకు ఒక్క ఇల్లు మంజూరు కాలేదని పేదలను గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆయన అన్నారు. మక్తల్ నియోజకవర్గ కి 175 కోట్ల నిధులతో 3500ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నామని అమరచింత మండలానికి మొదటి విడతగా 241 ఇండ్లు మంజూరయ్యాయని రెండో విడతలో 2004 ఇండ్లు మంజూరు చేస్తానని ఆయన అన్నారు. అలాగే ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రభుత్వం12 ట్రిప్పుల ఇసుకను ఉచితంగా లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీల మేరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, విద్యుత్తు, 500 కే గ్యాస్ సిలిండర్ రైతు రుణమాఫీ చేశామని ఆయన అన్నారు. అలాగే అమరచింత మండలంలో ప్రతి గ్రామానికి బీటి రోడ్డు వేస్తున్నామని అమరచింత మండల అభివృద్ధికి 50 కోట్లు నిధుల తో అభివృద్ధి చేశానని ఆయన చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అందజేస్తామని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను హారులైన పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి, కేశం నాగరాజుగౌడ్ జన్మదినం సందర్భంగా డిసిసి జిల్లా కార్యదర్శి, అయూబ్ ఖాన్ నివాసంలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర మంత్రివర్యులు అమర్ చింత పర్యటన సందర్భంగా ఆత్మకూరు సిఐ శివకుమార్, అమరచింత ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో భారీ బంధ బస్తా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, వివిధ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి

## జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించాలి

**బీసీ ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర నాయకులు రాష్ట్ర అధ్యక్షులు బాలకిష్టయ్య**

**నారాయణపేట టౌన్, జూన్ 20 ప్రభాతవార్త :** అన్ని కులాలకు జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ కల్పించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు బాలకృష్ణయ్య అన్నారు. శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆయన హాజరై మాట్లాడుతూ మా నిదానము అన్ని కులాలకు జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ కల్పించాలన్నారు. మన ఓటు మన అధికారం అని సిద్ధాంతంతో ముందుకు సాగరమే లక్ష్యమన్నారు. బీసీ ఎస్సీ ఎస్టీలంత ఐక్యంగా ఉండి అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఐక్యంగా ఉండి హక్కుల సాధన కోసం కృషి చేయాలన్నారు. అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులు సరాఫ్ నాగరాజు ముదిరాజ్, ఉపాధ్యక్షులు సూర్యకాంత్ మాజీ కౌన్సిలర్ జనరల్ సెక్రటరీ జి.మాధవ్ బండి శివరామిరెడ్డి, సెక్రెటరీ. కె.ఆంజనేయులు, పరిగి రమేష్, కొండయ్య, మహిళా అధ్యక్షురాలు ఈశ్వరమ్మ ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాల సభ్యులు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు

## మంత్రిని కలిసిన సమాచార హక్కు రక్షణ చట్టం 2005 జిల్లా సభ్యులు

**మక్తల్ టౌన్, జూన్ 20 ప్రభాత వార్త:** సమాచార హక్కు రక్షణ చట్టం 2005 ఎన్జీవో సొసైటీలో నారాయణపేట జిల్లా పొలిటికల్ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహించి ఎన్నో కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని అనతి కాలంలోనే మక్తల్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా గెలిచి ఇటీవల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంలో మర్యాద పూర్వకంగా డా.వాకిటి శ్రీహరిని కలిసి పూలమొక్కతో సన్మానించడం జరిగినది. కార్యక్రమములో సమాచార హక్కు రక్షణ చట్టం 2005 రాష్ట్ర మహిళా కన్వీనర్ సంద కోటి హాజమ్మ, నారాయణ పేట్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జి. నారాయణ,నారాయణ పేట్ డివిజన్ ఇంచార్జి దిలీప్ కుమార్, ఇస్మాయిల్ మక్తల్ మండల అధ్యక్షులు, శ్రీనివాస్‌రావు, శంకర్ లింగం, శేఖర్ మగనూరు మండల అధ్యక్షులు, బలరాం, కృష్ణ , లింగన్న, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మంత్రిని కలిసి మొక్కను అందజేస్తున్న దృశ్యం

## ఇండ్ల పరిసర ప్రాంతంలో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలి

**ఉప్పునుంతల, జూన్ 20 ప్రభాతవార్త :** వర్షాకాలం ప్రారంభమైందని, తమ ఇండ్ల పరిసర ప్రాం తాలలో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డా. స్వప్న సూచించారు. శుక్రవారం ఆమె ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల వైద్యాధికారిణి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో కలియ తిరిగారు మురుగునీరు లేకుండా జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు సూచించారు. ఇండ్లలో నీటి నిల్వ కోసం ఏర్పాటు చేసుకున్న డ్రమ్ములు గాని, హౌస్‌లు గాని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని పలు సూచనలు సలహాలు అందించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య్య అధికారిణి డా. స్వప్న, సూపర్వైజర్ ప్రభావతి, ఎంపిహెచ్ఓ మధునాయక్, హెల్త్ అసిస్టెంట్ శ్రీను, ఏఎన్ఎం దేవి, ఆశ కార్యకర్త పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పునుంతలలో నీటి నిల్వ ఉన్న తొట్టిని పరిశీలిస్తున్న వైద్య అధికారిణి డా. స్వప్న

## ఆర్టీసీ అధికారికి పిడిఎస్‌యు నాయకుల వినతి

**నారాయణపేటటౌన్,జూన్ 20 ప్రభాతవార్త :** విద్యార్థుల సంఖ్యకు అనుకూలంగా ఆర్టిసి బస్సులు నడిపించాలని కోరుతూ శుక్రవారం పిడిఎస్‌యు నాయకులు ఆర్టీసీ డిపో ఎస్పై అలివేలుకు వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ విద్యా సంస్థలన్నీ ప్రారంభమై దాదాపు 20 రోజులు కావస్తుందన్నారు. వివిధ గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడిపించకపోవడం సిగ్గుచేటు అని అన్నారు. గతంలో విద్యార్థులకు సమయానికి అనుకూలంగా ఆర్టీసీ బస్సులను నడపకపోవడంతో విద్యార్థులు చాలాఇబ్బందికి గురయ్యారు.ఇప్పుడు కూడా విద్యార్థులందరూ ఆయా గ్రామాలనుండి జిల్లా కేంద్రంలో రావడానికి చాలా ఇబ్బంది పడుతున్న పరిస్థితి ఉందన్నారు. గ్రామాలకు ఆర్టీసీ బస్సు నడవకపోవడంతో కొంతమంది విద్యార్థులు ఇంటిదగ్గరే ఉండి చదువుకు దూరమవుతున్నారన్నారు. మరికొన్ని గ్రామాలకు సమయ పాలనతో బస్సులు రాకపోవడంతో క్లాసులకు హాజరు కావడం లేదన్నారు. అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడిపించాలని పిడిఎస్‌యు జిల్లా కమిటీ డిమాండ్ చేశారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిస్‌యు జిల్లా కోశాధికారి మహేష్, జిల్లా నాయకులు కార్తీక్, తార, నవీన్, హేమలతతో పాటు తదితరులు ఉన్నారు.




వినతి పత్రం సమర్పిస్తున్న పిడిఎస్‌యు నాయకులు

## భూ సమస్యల కొరకే భూభారతి

**కృష్ణ, జూన్ 20 ప్రభాతవార్త :** భూ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించడం కొరకే భూభారతి ప్రవేశపెట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. భూభారతి రెవెన్యూ సర్వే చివరి రోజు అయిన శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ కృష్ణ తాసిల్దార్ కార్యాలయలలో నిర్వహిస్తున్న స్వీకరణ కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. జిల్లాలో ప్రతి గ్రామపంచాయతీలలో రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరిగిందని వాటిలో వచ్చిన అప్లికేషన్లను స్వీకరించి కేటగిరీల వారీగా నోటీసులు అందజేసి ఆర్డిఓ, తాసిల్దార్ స్థాయిలను ఉంటే పరిష్కరించస్తామని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు 3500 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. గత నెల కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూరు గ్రామంలో నిర్వహించడం జరిగిందని వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడం జరిగిందని తెలిపారు. ఇప్పటివరకు ఎన్ని అప్లికేషన్స్ వచ్చాయని వాటిలో ఎన్ని పరిష్కరించారని తహసీల్దార్ ద్వారా తెలుసుకున్నారు. వచ్చిన అప్లికేషన్లను ఎప్పటికప్పుడు ఆన్లైన్‌లో అప్లోడ్ చేయాలని కలెక్టర్ సూచించారు.




దరఖాస్తు కార్యాలయాలను సందర్శిస్తున్న కలెక్టర్

## పార్టీలో కష్టపడ్డ వారికే పదవులు

**కాంగ్రెస్ పార్టీ అబ్జర్వర్లు సాంబయ్య, భాస్కర్ యాదవ్**

**జడ్చర్ల, జూన్ 20 ప్రభాతవార్త :** బాలానగర్ మండల కేంద్రంలో శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ అబ్జర్వర్లు సాంబయ్య, భాస్కర్ యాదవ్‌లు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, మండలంలోని 37 గ్రామ పంచాయతీలలో నూతన కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. పార్టీ పటిష్టతకు గ్రామస్థాయిలో కార్యకర్తలు ముఖ్యమన్నారు. కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలన్నారు. వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి జనరల్ సెక్రెటరీ దుష్యంత్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శంకర్ నాయక్, ఓబిసి జిల్లా చైర్మన్ తిరుపతి, వెంకట్ రెడ్డి, దత్తాత్రేయ, నందీశ్వర్ జీ, హరి సింగ్, గ్రామ అధ్యక్షులు నర్సింలు, తదితర మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ అబ్జర్వర్లు

# సకాలంలో సన్నబియ్యాన్ని అందించాలి

## రేషన్ పంపిణీ 100 శాతం సజావుగా జరగాలి

**నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

**బిజినేపల్లి, జూన్ 20 ప్రభాతవార్త:** రేషన్ పంపిణీ 100 శాతం సజావుగా నిర్వహించాలని, ఎక్కడా అక్రమాలకు తావులేకుండా చూడాలని నాగర్ కర్నూల్ నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశించారు. శుక్రవారం వెలుగొండ గ్రామంలో 16వ నెంబర్ రేషన్ షాపును జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.చౌక ధరల దుకాణాల ద్వారా వినియోగదారులకు సకాలంలో సన్న బియ్యాన్ని పారదర్శకంగా అందించాలని సూచించారు. రేషన్ డీలర్లు నిబంధనలు పాటించాలి ప్రతి లబ్ధిదారునికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేయాలన్నారు. ఈనెల 30వ తేదీ వరకు రేషన్ పంపిణీ కొనసాగుతుందని చెప్పారు. గ్రామంలో 2 రేషన్ దుకాణాలు ఉన్నాయని, 16వ నెంబర్ రేషన్ దుకాణం లో 504 కార్డులు, 38వ రేషన్ దుకాణంలో 499 రేషన్ కార్డులు ఉన్నాయని అధికారులు కలెక్టర్ కు తెలిపారు.ప్రతి రేషన్ డీలర్ ప్రభుత్వం విధించిన నిబంధనలు పాటిస్తూ పంపిణీ సజావుగా జరగాలని తెలిపారు. రేషన్ షాపులో స్టాక్ రిజిస్టర్ నిర్వహణ, స్టాక్ వివరాలు ప్రదర్శించే బోర్డులు, బయోమెట్రిక్ ఈపాస్ యంత్రాల పనితీరు, రిజిస్టర్ ప్రకారం ఓపెనింగ్, క్లోజింగ్ బ్యాలెన్స్ సరిగ్గా ఉన్నాయా లేదా అనే వివరాలపై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులకు 100 శాతం సన్న బియ్యం అందించాల్సిన అవసరం ఉందని స్పష్టంగా చెప్పారు. ఎక్కడైనా సమస్యలు ఎదురైతే వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో, రవాణా ఇతర ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం జూన్‌లోనే మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా నాగర్ కర్నూల్ జిల్లాలో ఇప్పటికే 65.69 పంపిణీ పూర్తయిందని కలెక్టర్ వివరించారు. ఇప్పటి వరకు 1,60,351 మంది లబ్ధిదారులు మూడు నెలల సన్న బియ్యం అందుకున్నారని చెప్పారు. జిల్లాలో ఉన్న మొత్తం 2,43,720 రేషన్ కార్డులకు గాను జూన్, జూలై, ఆగస్టు నెలలకు బియ్యం పంపిణీ జరుగుతోంది అన్నారు. ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున మొత్తం 14169.405 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. సాధారణంగా ప్రతి నెల 15వ తేదీ వరకు మాత్రమే పంపిణీ జరిగే విధానాన్ని మర్చి ఈ నెల 30వ తేదీ వరకు పంపిణీ కొనసాగించాలనే ఆదేశాలు జిల్లా వ్యాప్తంగా ఉన్న రేషన్ డీలర్లకు ఇచ్చినట్లు చెప్పారు. ఇంకా బియ్యం అందుకోని లబ్ధిదారులు ఈ నెలాఖరు వరకు బియ్యం తీసుకోవచ్చని తెలిపారు. ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట బిజినపల్లి తహసిల్దార్ మునిరోద్దిన్, ఆర్ఐ బాలరాజ్, రాఘవేందర్ డీలర్ రంగరాజు, బాలస్వామి తదితరులు ఉన్నారు.



రేషన్ షాపును తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్

# స్థానిక ఎన్నికల్లో సత్తా చాటి కేసీఆర్‌కు అండగా నిలుద్దాం

**ఖిల్లా ఘనపురం. జూన్ 20, ప్రభాతవార్త:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టిఆర్ఎస్ నాయకులు సత్తా చాటి కెసిఆర్ కు అండగా నిలవాలని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో టిఆర్ఎస్ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ లంటూ 420 హామీలు ఇచ్చి యువకులను మహిళలను రైతులను ప్రజలను నిలువునా ముంచిందని దీనిని గ్రామాలలో ప్రజలలోకి విస్తృతంగా తీసుకుపోయి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు సర్పంచ్ తో పాటు ఎంపీటీసీ జెడ్పిటిసి ఎన్నికలలో టిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి కెసిఆర్ కు అండగా నిలవాలన్నారు. రైతు పెట్టుబడి 15000 అంటూ రైతులను మోసం చేశారని మరణించిన రైతులకు రైతు బీమా చెల్లించడం లేదని. మహిళలకు నెలకు 2500 రూపాయలు ఇంతవరకు ఎక్కడా చెల్లించలేదని, పెళ్లి చేసుకున్న నిరుపేద మహిళలకు కల్యాణ లక్ష్మి ౹ఱ లక్ష రూపాయలతో పాటు తులం బంగారం అందజేస్తామని ఆ ఊసే ఎత్తడం లేదని అందరిని మోసగించిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రాబోయే స్థానిక ఎన్నికలలో చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల నోటిఫికేషన్ ఈనెల చివరలో వచ్చే అవకాశం ఉందని అప్పటివరకు మండలంలో ఉన్నటువంటి ముఖ్య నాయకులు సమూహంగా ఏర్పడి ప్రతిరోజు ఉదయం సాయంత్రం రెండు మూడు గ్రామాలను ఎంపిక చేసుకుని కార్యకర్తలను సమాయత్తం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీకి సేవ చేస్తూ మద్దతుగా ఉన్న వారిని సర్పంచ్ ఎంపీటీసీ ఎన్నికలలో ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు రాళ్ల కృష్ణయ్య, జిల్లా పార్టీ అధ్యక్షులు గట్టు యాదవ్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, రాజా మాజీ ఎంపీటీ కృష్ణ నాయక్, మాజీ మార్కెట్ చైర్మన్ లక్ష్మారెడ్డి, జడ్పిటిసి సామ్య నాయక్, బాలిశ్వర్ రెడ్డి జాతృనాయక్ మాజీ ప్రజాప్రతినిధులు వివిధ గ్రామాలకు చెందిన ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

# మరమ్మత్తుకు నోచుకోని బట్టర్‌ఫ్లై లైట్స్

◆ అధికారులు పట్టించుకోవడం లేదంటున్న స్థానికులు.. ◆ మరమత్తులు చేయిస్తామంటున్న మున్సిపల్ కమిషనర్

**నారాయణపేట ప్రతినిధి జూన్ 20, ప్రభాత వార్త :** జిల్లా కేంద్రంలో ప్రధాన రోడ్డు మధ్యలో సుభాష్ రోడ్డు నుండి ఇటు నర్సిరెడ్డి సర్కిల్ మీదుగా సింగారం రోడ్డు పొడవునా అటు యాద్గిర్ మెయిన్ రోడ్ పొడవైన జిల్లా కేంద్రం నలువైపులా రోడ్ డివైడర్‌ల మద్యలో గత ప్రభుత్వంలో ఎర్పాటు చేసిన బటర్ ఫ్లై ఎల్ఇడి లైట్లు గత కొన్ని రోజులుగా ఒక్కొకటిగా వెలగకుండా చెడిపోతు మరమ్మత్తులకు నోచుకోవడం లేదు అంటున్నారు. స్థానిక ప్రజలు వర్షాకాల ప్రారంభంలోనే అధికారుల తీరు ఈ విధంగా ఉంటే ఈదురుగాలి వీచే సమయానికి ఎలాంటి పరిస్థితి ఏర్పడుతుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రోడ్డు ఉన్నా లైట్లు ఒక్కొక్కటిగా చెడిపోతూ రోజులు గడుస్తున్నా వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయడం కానీ మరమ్మత్తులు చేయడంలో అధికారులు అసలు పట్టించుకోడం లేదని ఇబ్బందులు పడుతున్నట్లు ప్రయాణికులు చెబుతున్నారు. అలాగే అంబేద్కర్ చౌరస్తాలో కూడా ఐమాక్స్ లైట్స్ కూడా చాలారోజుల వెలగడం లేదని స్థానికులు అంటున్నారు. లైట్లు వేసినట్లే అనిపించినా ఎప్పుడూ బ్లింక్ అవ్వడం, ఆరిపోవడం తప్పా పూర్తిస్థాయిలో వెలగకపోవడంతో దారి పొడవునా నడుచుకుంటూ పోవాలంటే కాలనీవాసులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నామని అంటున్నారు . ఇప్పటికైనా అధికారులు స్పందించి లైట్లు సక్రమంగా వెలిగేందుకు చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.



వెలగని బటర్‌ఫ్లై లైట్లు

**మరమత్తులు చేపడతాం..**

**మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్**

బటర్ ఫ్లై లైట్స్ చెడిపోతున్నట్లు మా దృష్టికి వచ్చింది. వీలైనంత త్వరగా వాటిని మరమత్తులు చేయిస్తాం. మూడు రోజుల క్రితం గాలికి విరిగి పడిపోయిన వాటి లో కొత్త లైట్స్ స్తంభాలన ఏర్పాటు చేయడం జరిగింది. వర్షాకాలం కాబట్టి కార్బన్ వచ్చి కొన్ని వెలగకపోవచ్చు, పూర్తిగా చెడిపోయిన వాటిలో కొత్త వాటిని ఏర్పాటు చేస్తామని మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్ వివరణ ఇచ్చారు.

# యువతకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించాలి

**అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్**

**నారాయణపేట, జూన్ 20 ప్రభాతవార్త :** నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వచ్చిన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నశాముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో ముఖ్య లక్ష్యాలు వివరించారు. అందులో భాగంగా మన జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా ప్రథమ స్థానంలో నిలిపేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా ముఖ్య లక్ష్యం నషా ముక్త్ భారత్ అభియాన్ నిషా లేని భారతదేశం కావాలి వాటి దుష్ప్రభావాలను ప్రజలకు తెలిసే విధంగా కార్యక్రమాలు రూపొందించాలని తెలియజేశారు. మన జిల్లాలో మాదకద్రవ్యాల రహిత జిల్లాగా ముందుండాలని కోరారు. ముఖ్యంగా నషాముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వారం రోజులు షెడ్యూల్స్ రూపొందించారు. 21.06.2025 నుండి 26.06.2025 వరకు వరుసగా నషాముక్తి భారత్ అభియాన్ కార్యక్రమాలను ప్రజలందరికీ అవేర్నెస్ కలిగే విధంగా రూపొందించాలని తెలియజేశారు. నషా ముక్త్ భారత్ అభియాన్ ముఖ్యంగా కార్యక్రమంలో భాగంగా పోస్టర్స్ పాంప్లెంట్స్ అందరికీ కూడా వీటిపై అవేర్నెస్ కలిగే విధంగా చేయాలని తెలియజేశారు. ముఖ్యంగా పిల్లలు కాలేజెస్ డిగ్రీ కాలేజెస్ యూనివర్సిటీ పోస్టర్స్ లో ప్రతి ఇన్స్టిట్యూషన్ వద్ద క్లబ్స్ ఏర్పాటు చేయాలని తెలియజేశారు. ప్రతినెల వీరు సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి వాళ్లకి మాదక ద్రవ్యాల గురించి వాటి దుష్ప్రభాతం గురించి తెలిసేటట్టుగా వాటి గురించి చర్చించాలని తెలియజేశారు. మాదకద్రవ్యాలకి లోను కాకుండా చూడాలని తెలియజేశారు. నిషా అంటే మత్తు మైకం కమ్మే పదార్థాల వినియోగం అందులో వాటి వినియోగం వల్ల కలిగే దుష్ప్రవరాలను వివరించారు. గంజాయి,పొగాకు, మద్యం మొదలైన వాటి ఉపయోగం వల్ల యువత ఇలా బలైపోతుందో వివరించారు. ప్రోగ్రాం మన జిల్లాలో మాదకద్రవ్య వ్యవస్థ ఎక్కడ కూడా ఉండకుండా చేయాలి మరి యువతను దాని నుండి విముక్తి కల్పించాలి. డిజిటల్ ఎంగేజ్మెంట్ ప్రోగ్రామ్ ద్వారా మీడియా చాలా ప్రచారం పెద్దది చాలా పెద్ద ఎత్తున ప్రచారం కల్పించాలని కోరారు. టీవీ లోకల్ ఛానల్ మీడియా ఏర్పాటు చేసి ప్రజలందరికీ యువతకు దీనిపై అవేర్నెస్ కల్పించే విధంగా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని చూపించారు.

# అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలపై ప్రత్యేక దృష్టి

**నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**


**బిజినేపల్లి, జూన్ 20 ప్రభాతవార్త:** అంగన్వాడిలో పిల్లలకు అందిస్తున్న ఆహారం మెనూ ప్రకారం అందించాలని,కేంద్రాల్లో పిల్లల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. వెలుగొండ గ్రామంలో శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యానికి సంబంధించిన రికార్డులను పక్కాగా నిర్వహించాలని, అలాగే, అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని సూచించారు. కలెక్టర్ అంగన్‌వాడీలలో పిల్లల పెరుగుదల, అభివృద్ధికి సంబంధించిన వివరాలను కూడా తెలుసుకున్నారు. పిల్లలకు అందించే పోషకాహారం గురించి కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంగన్‌వాడీలో పిల్లల నమోదు, ఆహార సరఫరా, పరిశుభ్రత, మౌలిక సదుపాయాలు వంటి వాటిని పరిశీలించారు. అంగన్‌వాడి కేంద్రం సందర్శించి రిజిస్టర్లు, మెనూ ప్రకారం అందిస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ అంగన్‌వాడి కేంద్రం పనితీరును మెరుగుపరచడానికి కొన్ని సూచనలు చేశారు. కలెక్టర్ అక్కడే ఉన్న చిన్నారులతో మాట్లాడారు. మీరు ఎలా చదువుతున్నారు టీచర్లు బాగా బోధిస్తున్నారు కదా అనే ప్రశ్నలతో వారిని ఉత్సాహపరిచారు. పిల్లల్లో చొరవను ప్రోత్సహిస్తూ, ప్రతిరోజూ అంగన్‌వాడి పాఠశాలకు హాజరు కావాలని,ఆటవస్తువుల ద్వారా వారికి ఆనందదాయకంగా, సృజనాత్మకంగా బోధన ఉండేలా టీచర్లు కృషి చేయాలని సూచించారు. కలెక్టర్ చిన్నారులను చిత్రాలను చూపించి అక్షరాలను గుర్తించేలా చదివించారు. చిన్నారుల భవిష్యత్తు బలంగా ఉండాలంటే ప్రాథమిక స్థాయిలోనే వారికి సరైన మార్గనిర్దేశం అవసరమని ఆయన పేర్కొన్నారు. పిల్లలకు మెనూ ప్రకారం వారంలో రెండు రోజులు ఎగ్ బిర్యాని, అందించాలన్నారు. అంగన్వాడి కేంద్రంలో ఉన్న స్టోరును పరిశీలించి శుభ్రత కలిగిన వాతావరణం చిన్నారుల ఆరోగ్యానికి ఎంత ముఖ్యమో ఆయన స్పష్టం చేశారు. మౌలిక సదుపాయాలు సక్రమంగా లేకపోతే అందే సేవల ప్రభావం తగ్గుతుందని తెలిపారు. అంగన్‌వాడి కేంద్రానికి వచ్చిన బాలింతలు గర్భిణులకు అంగన్‌వాడి కేంద్రం ద్వారా అందుతున్న ఆహార పదార్థాలు సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు.



అంగన్‌వాడి కేంద్రాల్లో పిల్లల సంక్షేమంపై ఆరా తీస్తున్న కలెక్టర్

## కన్ను మూసిన నిఘా నేత్రాలు

**చిన్నచింతకుంట, జూన్ 20 ప్రభాతవార్త :** ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులకు పెట్టు. తమ కళ్ళ ఎదుట చీమ చిట్టుక్కుమన్న పసిగట్టే శక్తి వాటికి సొంతం పోలీసు పెట్రోలింగ్ చేసిన చేయకపోయినా అవి మాత్రం 24/7 పెట్రోలింగ్ చేస్తూనే ఉంటాయి. అలాంటి సీసీ కెమెరాల నిర్వాహణపై పోలీసు అధికారులు అశ్రద్ధ వహించకపోవడంతో గ్రామాలలో చిన్నా, చితక దొంగతనాలు పెరిగిపోతున్నాయి. మండలంలోని గ్రామాలలో ప్రధాన కూడలిలో చాలా చోట్ల దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రధానంగా పోలీసుల సూచనలతో మండలంలోని ఆయా షాపులో యజమానులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గ్రామాలలోని ప్రధాన కూడలిలో ఏర్పాటుచేసిన సిసి కెమెరాల వ్యవస్థ నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం పూర్తిగా మూలనపడ్డాయి. గ్రామాల్లో సమస్యాత్మక ప్రాంతాలలో జరిగే అల్లర్లను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయి. కానీ పోలీసుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రజాప్రతినిధులు, కొందరు దాతలు చేసిన సహకారమంతా బూడిదలో పోసిన పన్నీరైంది. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులకు సమానం అన్న సూక్తిని పలు సందర్భాల్లో పోలీస్ అధికారులు చెప్పినా ఆచరణలో విఫలమైంది. దీంతో నిఘా వ్యవస్థ అస్తవ్యస్తమైంది. ఇప్పటికైనా పోలీసులు సీసీ కెమెరాల పర్యవేక్షణ చేసి గస్తీ నిర్వహించి దొంగల బెడదతోపాటు నేరాలను అరికట్టాలని మండల ప్రజలు పోలీసులను కోరుతున్నారు.



ఆకాశం వైపు చూస్తున్న సీసీ కెమెరా

## పిల్లలకు రుచికరమైన ఆహారమందించాలి

**కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు దత్తురావు**



విద్యార్థులతో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు

**నారాయణపేట టౌన్, జూన్ 20 ప్రభాతవార్త :** పిల్లలకు రుచికరమైన ఆహారాన్ని అందించాలని ప్రభుత్వ గ్రౌండ్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు దత్తురావు అన్నారు. శుక్రవారం నారాయణపేట మండలం జాజపూర్ గ్రామం ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన ఆహారాన్ని అందించాలని వంట నిర్వాహకులకు సూచించారు. గ్రామంలోని అంగన్వాడి కేంద్రం నుండి 28 మంది చిన్నారులను ప్రాథమిక పాఠశాల చేర్పించినట్లు పాఠశాల ప్రధానో పాధ్యాయులు పద్మజ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్ ప్రధానోపాధ్యాయులు భారతి, భాను ప్రకాష్ బాలకృష్ణ గీత రజిత, అంగన్వాడి టీచర్లు ఆశమ్మ తదితరులు ఉన్నారు.

## ఘనంగా కేఎస్ఆర్ వెంకట్ రెడ్డి జన్మదిన వేడుకలు

**వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి**

**జడ్చర్ల, జూన్ 20 ప్రభాతవార్త :** బాలానగర్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కేఎస్ఆర్ వెంకట్ రెడ్డి ఆయన సోదరుడు శేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. కేఎస్ఆర్ వెంకట్ రెడ్డి నివాసంలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి హాజరై కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే వెంకట్ రెడ్డి సోదరుడు శేఖర్ రెడ్డికి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. బాలానగర్ లో మంచి నాయకుడిగా ఎదుగుతున్న కేఎస్ఆర్ వెంకట్ రెడ్డి భవిష్యత్తులో రాజకీయంగా ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శాలువాలు పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : ఎమ్మెల్యే


సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**నారాయణపేట టౌన్, జూన్ 20 ప్రభాతవార్త :** ప్రజా ప్రభుత్వంలో ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే డా. పర్ణిక రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని సివిఆర్ భవన్లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి సోషల్ మీడియా సమీక్ష సమావేశం జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ముందుకు సాగుతుందన్నారు. మన జిల్లా వాసి ముఖ్యమంత్రి రేవంతన్న కావడం మన అందరి అదృష్టమన్నారు. అదేవిధంగా మక్తల్ శాసనసభ్యులు వాకిటి శ్రీహరికి మంత్రి పదవి రావడం మరో అదృష్టం అన్నారు. జిల్లా మరింత అభివృద్ధిలో ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సోషల్ మీడియాతో పాటు తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ ఆస్తులు కాపాడుకోవడం మనందరి బాధ్యత

**అంబేద్కర్ సంఘ కార్యదర్శి కరాటే రవి కుమార్**

**జడ్చర్ల, జూన్ 20 ప్రభాతవార్త :** బాలానగర్ మండల కేంద్రంలో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని, వాటిని కాపాడుకునే బాధ్యత గ్రామ ప్రజలపై ఉందని అంబేద్కర్ సంఘ కార్యదర్శి రవికుమార్ అన్నారు. శుక్రవారం భవాని మాత గుడి ఆవరణలో ఏర్పాటుచేసిన సమావేశంలో రవికుమార్ భూ ఆక్రమణల వివరాలు తెలియజేసే కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలానగర్‌లోని సర్వే నెంబర్.1 లో వెంకటేశ్వర స్వామి ఆలయం భూమి 1 ఎకరా 31 గుంటలు, సర్వే నెంబర్ 6 లో ఎర్రకుంట లోని 1 ఎకరా 25 గుంటలు, గ్రామ శివారు లోని పాత రైల్వే గేటు రోడ్డు కూడా ఆక్రమణలకు గురైంది అన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించిన 4 ఎకరాల 11 గుంటల భూమిలో కొంత భూమి ఆక్రమణకు గురైనట్టు తెలిపారు. సర్వే నెంబర్ 203, 204లో రెండు ఎకరాలు ఆరెకటిక సంఘం కొనుగోలు చేశారని, ఇటీవల కొందరు ఆ భూమిని కూడా ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. సాదు వెంకట్ రెడ్డి వెంచర్లో 10 భూమి కబ్జాకు గురైందన్నారు. గ్రామ శివారులోని సర్వే నెంబర్ 84లో జర్నలిస్టులకు 38 గుంటలు గతంలో కేటాయించారని, అందులో 8 మంది జర్నలిస్టులకు ప్లాట్లు కేటాయించి మిగతా భూమి కబ్జా చేశారన్నారు. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కబ్జాకు గురైన ప్రభుత్వ ఆస్తులను రక్షించాలని మండల అంబేద్కర్ సంఘం కార్యదర్శి రవికుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, కెవి మధు, మల్లేష్, దినేష్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కళాశాల ఎదుట విద్యార్థుల ఆందోళన

**నారాయణపేట టౌన్, జూన్ 20 ప్రభాతవార్త :** సస్పెండ్ చేసిన నారాయణపేట తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాల ఔట్ సోర్సింగ్ ప్రిన్సిపల్ జగదీష్ రెడ్డిని తిరిగి విధుల్లో కొనసాగించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో కళాశాల ముందు ఆందోళనతో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ ఈ కారణము లేకుండా సస్పెండ్ చేసిన జగదీశ్వర్ రెడ్డిని తిరిగి విధుల్లో కొనసాగించాలన్నారు. ప్రిన్సిపల్ విధుల్లోకి తీసుకోకపోతే కళాశాలలో చదివేవిద్యార్థులందరికీ టీసీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎంఏ రషీద్ కళాశాల దగ్గరకు చేరుకొని ఆందోళన చేయవద్దని సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకుందామని చెప్పడంతో విద్యార్థులు ఆందోళన విరమింప చేశారు. కాగ కళాశాలలో పనిచేసే ప్రభుత్వ లెక్చరర్లు ఆయనపై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేయడంతో సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఆందోళన కార్యక్రమంలో విద్యార్థులతో పాటు తదితరులు ఉన్నారు.

## రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక ఎన్నికలు జరపాలి

**జాతీయ బీసీ సంక్షేమ సంఘం వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి ముకుంద నాయుడు**

**వనపర్తి, జూన్ 20 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు జరిపే స్థానిక ఎన్నికలు చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం వనపర్తి జిల్లా ప్రధానకార్యదర్శి ముకుంద నాయుడు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మంత్రులు ఎమ్మెల్యేలు గత కొన్ని రోజులుగా స్థానిక ఎన్నికలు త్వరలోనే నిర్వహిస్తామని పలు ప్రకటనలు చేస్తున్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి వెలవడకుండానే స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ త్వరలో అని చెప్పడంతో బీసీ ప్రజానీకం ఆందోళనగా వుందని, బీసీ రిజర్వేషన్లు అమలుతోనే స్థానిక ఎన్నికలు జరగాలని దానికోసం గత ఏడాదిగా ఎన్నికలు వాయిదాలు వేస్తూ మళ్లీ ఇప్పుడు అది తేల్చకుండా ఎన్నికలు అంటే బీసీలు అసహనం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు లేకుండా స్థానిక ఎన్నికలకు సిద్ధం కావొద్దని ఈ విషయంలో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు వున్నా రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత తీసుకొని పూర్తిచేయాలని బీసీలు హామీని నమ్మి మద్దతు నిలిచిన విషయం మర్చిపోవద్దని కోరారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు బీసీ టైగర్ ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధనకై పోరాడతామని తెలిపారు. కచ్చితంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఎన్నికలకు వెళ్లాలని దీనిపై త్వరలో హామీ నెరవేరేలా సంఘం కార్యాచరణ చేపడతామని తెలిపారు.

## రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

**మానవపాడు, జూన్ 20 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి రెవెన్యూ చట్టం ద్వారా భూ సంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని రైతుల శ్రేయస్సు కోసం సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా డిసిసి జనరల్ సెక్రెటరీ మహ్మద్ సిరాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద భూభారతి రెవెన్యూ సదస్సు ను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన స్థానిక నాయకులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ధరణి ద్వారా రైతులు తీవ్ర ఇబ్బందులు గురయ్యారని కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని విధాలుగా రైతులకు మేలు చేసేందుకు భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ఈ భూభారతి రెవిన్యూ చట్టాన్ని ప్రభుత్వం తెచ్చిందన్నారు. రైతులు పెండింగ్‌లో ఉన్న భూ సంబంధిత సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కార దిశగా ముందుకు వెళ్లాలని తెలిపారు. అయితే మానవపాడు రైతుల నుంచి 38 దరఖాస్తులు రాగా చందపూర్ నుంచి 14 వచ్చినట్లు రెవేన్యూ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భరత్ రెడ్డి, మల్లేష్, శేఖర్, వెంకటన్న, సాయిబాబా, రామకృష్ణ, పుండుకూర శ్రీను, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగులు పి.ఎం దక్ష యోజనలో వివరాలు నమోదు చేసుకోవాలి

**జిల్లా న్యాయ సేవఅధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వి.రజని**

**వనపర్తి క్రైమ్, జూన్ 20 ప్రభాతవార్త:** వికలాంగులు పి.ఎం దక్షయోజనలో వివరాలు నమోదు చేసుకోవాలి అని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ న్యాయమూర్తి వి. రజని అన్నారు శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోనీ వికలాంగుల పునరావాస కేంద్రంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని వికలాంగులకు చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మానసిక శారీరక బాల ది వ్యాంగులను పునరావాస కేంద్రాలలో చేర్పించి వారి భవిష్యత్తును బంగారు మయం చేయాలని తల్లి దండ్రులకు సూచించారు. అదేవిధంగా దివ్యాంగ్ జన్ రోజ్ గర్ సేతు, దివ్యాంగ్ జన్ కౌశల్ వికాస్ పథకాల గురించి వివరించారు. దివ్యాంగులు అందరికీ కూడా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సేవలు అందిస్తామని తెలియజేశారు. ఉచిత న్యాయసలహాల కొరకు 15100టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించవచ్చు అని తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ ఉత్తరయ్య పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో కామ్రేడ్ వై.తారక్ వర్ధంతి వేడుకలు

**కల్వకుర్తి, జూన్ 20 ప్రభాతవార్త:** కల్వకుర్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ హైద రాబాద్ సర్కిల్ వ్యవస్థాపకులు కామ్రేడ్ వై.తారక్ వర్ధంతి యూనియన్‌డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కల్వకుర్తి పట్టణంలో ప్రభుత్వ మరియు ప్రజల భాగస్వామ్య సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో యూనియన్ వ్యవస్థాపకులు వై.తారక్ చిత్రపటానికి ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ కల్వకుర్తి ఏడిబి కార్యదర్శి పరశురాం, ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ కార్యద ర్శి వేదావతి, వెల్దండ ఎస్‌బీఐ యూనియన్ కార్యదర్శి వి.రాజులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వృద్ధులకు అత్యవసర సరుకులను, పండ్లను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం కార్యదర్శులు పరశురాం, వేదావతి, వి.రాజులు మాట్లాడుతూ వృద్ధులకు ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ అండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ సభ్యులు కార్తీక్, సతీష్, కిరణ్, నరేష్, రవి, వెంకటేశ్వర్లు, స్వరూపా, శ్వేత, గాయత్రీ, సాయికృష్ణ, వృద్ధాశ్రమ నిర్వాహకులు పీ.వెంకటయ్య, ఓల్డ్ ఏజ్ హోమ్ కో ఆర్డినేటర్ పద్మ, అసిస్టెంట్ కోఆర్డినేటర్ పరమేష్, వృద్ధులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఆయిల్ ఫామ్ సాగుతో అధిక లాభాలు

**మానవపాడు, జూన్ 20 ప్రభాతవార్త :** రైతుల ఆర్థికాభివృద్ధికి ఆయిల్ ఫామ్ సాగు ఎంతగానో దోహదపడుతుందని ఈ సాగుతో నీటిని ఆదా చేయడంతో పాటు అంతర పంటల సాగు చేస్తూ మరింత ఆదాయం రైతులకు చేకూరుతుందని జిల్లా ఉద్యావన శాఖ అధికారి ఎంఏ అక్బర్ అన్నారు. మండల కేంద్రంలో రైతులు, ప్రకాష్ గౌడ్, శివ కేశవులు గౌడ్, ప్రసాద్ గౌడ్ పొలాల్లో మెగా ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్‌లో భాగంగా మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహ్మద్ సిరాజ్ రైతులు పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**వైయస్సార్ అడుగుజాడలో ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక**

**రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి శ్రీహరి వెల్లడి**


ఆత్మకూరులో చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి


ఆత్మకూరు మండల గొల్ల కురుమ యాదవులు మంత్రి వాకిడి శ్రీహరికి గొర్రె పిల్లతో సన్మానం నిర్వహిస్తున్న దృశ్యం

**ఆత్మకూర్ జూన్ 20, ప్రభాతవార్త;** దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రహాన్నిగా నిలిపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త నిశ్చయంతో పని చేస్తుందని తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి, శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం రోజు మండల కేంద్రమైన ఆత్మకూరు పట్టణానికి నూతనంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం వచ్చిన రాష్ట్రమంత్రికి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీగా స్వాగతం పలికారు. అనంతరం పట్టణ సమీపంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఇందిరా మహిళల లబ్ధిదారుల కు చిక్కుల పంపిణీ, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ గడచిన పది సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రం అధోగతికి చేరుతుందని కేవలం ఒక కుటుంబం మాత్రమే దోపిడీకి పాల్పడి తెలంగాణ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మంత్రివర్గం తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోని అగ్రగామిగా నిలిపేందుకు శక్తి వంచన లేకుండా పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలకు వైయస్ రాజశేఖర్ రెడ్డి అడుగుజాడలో ఇందిరమ్మ ఇండ్లను కేటాయించి నిర్మింప చేసేందుకు పూర్తి స్థాయిలో ప్రభుత్వం సహాయ సహకారాలు అందజేస్తుందని ఆయన పేర్కొన్నారు. గత అమరచింత నియోజకవర్గంలో ఆత్మకూరు మండలం మూడు ముక్కలుగా ఏర్పాటు కావడంతో తీవ్రంగా నష్టపోయిందని ఈ విషయాన్ని ప్రత్యేకంగా దృష్టిలో ఉంచుకొని ఆత్మకూర్ పట్టణాన్ని రెవెన్యూ డివిజన్ గా ఏర్పాటు చేయడమే కాకుండా 20 కోట్ల ప్రత్యేక నిధులతో ఆత్మకూర్ పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు తాను శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. పట్టణ సమీపంలోని పరమేశ్వర స్వామి చెరువు కట్టను వెడల్పు చేసి రహదారి నిర్మించడమే కాకుండా పట్టణంలో సిసి రోడ్లు కానీ మురుగు కాలువలను కానీ పూర్తిస్థాయిలో నిర్మించేందుకు తాను ఎల్లవేళలా కార్యకర్తలకు అందుబాటులో ఉండి చర్యలు తీసుకుంటారని ఆయన పేర్కొన్నారు. అంతకుముందుగా పరమేశ్వర స్వామి చెరువు కట్ట నుండి భారీ ర్యాలీగా తిరుగుతూ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి , గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత పారిశ్రామిక విభాగం రాష్ట్ర చైర్మన్ నాగరాజు గౌడ్, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మొగిలి, గంగాధర్ గౌడ్, అయూబ్ ఖాన్, ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్, మక్తల్ నియోజకవర్గం అధ్యక్షులు తులసిరాజు యాదవ్, మాజీ అధ్యక్షులు రహమతుల్లా, కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లగొండ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు. ర్యాలీకి ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి సీఐ శివకుమార్, పలువు ఎస్సైలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## వైద్య సిబ్బంది బాధ్యతతో సేవలందించాలి

**ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**


బిజినేపల్లి పిహెచ్‌సిని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

**బిజినేపల్లి, జూన్ 20 ప్రభాతవార్త:** పిహెచ్‌సిలో సమయానుకూలంగా వైద్యులు, సిబ్బంది విధులకు హాజరు కావాలని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని, వైద్యం కోసం వచ్చిన రోగులను వెంటనే ఆసుపత్రిలో చేర్చుకోని వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. బిజినపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి ఆస్పత్రిలో ఓపీ రిజిస్టర్, మందుల స్టాక్ను పరిశీలించి వైద్యులతో కలెక్టర్ మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలనికేసులు సీరియస్ గా ఉన్నప్పుడు మాత్రమే నాగర్ కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి లేదా ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేయాలని కలెక్టర్ సూచించారు. ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సదుపాయాలను రోగులతో వాడికి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో ఉన్న మందుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత కల్పిస్తున్నందున ఆసుపత్రిలోని వివిధ విభాగాల ద్వారా పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందాలని వైద్య అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలోని ఓపి వివరాలు, పేషెంట్స్‌కు అందుతున్న వైద్య సేవలు, మందులు నిల్వ, డాక్టర్స్, నర్సుల ఖాళీల వివరాలు డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ప్రాధాన్య లక్ష్యంగా ఉంటుందన్న ఆయన, ఆసుపత్రులకు వచ్చే ప్రతి ఒక్కరు తగినంత వైద్య సేవలు పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించాలని, ఆసుపత్రిలో శుభ్రత, ఔషధాల అందుబాటు, రికార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ తెలిపినారు. రోగులపై సానుభూతితో వ్యవహరించాలని, వారి సమస్యలు పటిష్టంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రుల్లో శుభ్రత, ఔషధాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి అని జిల్లా కలెక్టర్ వైద్యులకు సూచించారు. వైద్యాధికారులు డా. శివకుమార్, అజహర్ వైద్య సిబ్బంది ఉన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలి


పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్‌పి

**నారాయణపేట, జూన్ 20 ప్రభాతవార్త :** గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలి. సైబర్ నేరాలు, దొంగతనాల పట్ల జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి. శుక్రవారం జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ మద్దూర్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌ల పరిసరాలను, పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న, నమోదైన కేసుల వివారలు, ఎక్కువ ఏలాంటి కేసులు వస్తున్నాయని, రిసెప్షన్ స్టేషన్ రికార్డ్ లు తనిఖీ చేసి కేసుల దర్యాప్తు విషయంలో అలసత్వం వహించవద్దని, కేసు నమోదు అయినా వెంటనే రిసిప్ట్, ఎఫ్‌ఐఆర్ కాపీ తప్పకుండా ఇవ్వాలని సూచించారు. ప్రజలు తీసుకువచ్చే ఫిర్యాదులను పెండింగ్ లో ఉంచకుండా బాధితుల పిర్యాదుల పట్ల తక్షణమే స్పందించాలని, ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో ఉండాలని సూచించారు. బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బంది 100 డయల్ కాల్స్‌కి తక్షణమే స్పందిస్తూ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి చూపుతూ, స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరుచూ సందర్శించాలన్నారు. పాత నేరస్థుల పై నిఘా ఉంచాలన్నారు. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు, ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపరచుకుంటూ ప్రజలకు, యువతకు ప్రత్యేకంగా, షీ టీమ్స్, ట్రాఫిక్ నియమాలు, సైబర్ నేరాల నివారణ పై చైతన్యాన్ని తీసుకురావాలని సూచించారు. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని యువకులను మోసం చేసే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ అంతా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఉంటూ విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది అందరూ కృషి చేయాలని, సిబ్బంది ఏ డ్యూటీ చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. సిబంది అధికారులు అందరూ విధులు సక్రమంగా విధులు నిర్వహించడం ద్వారానే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని సూచించారు. ఫంక్షనల్ వర్టికల్స్, 5ఎస్ అమలు, హెచ్‌ఆర్‌ఎంఎస్, జనరల్ డైరీ రికార్డులు, రిసెప్షన్, పిటిషన్ విచారణలకు సంబంధించి పెట్రోకార్, బీట్ డ్యూటీ సిబ్బంది ఏవిధమైన విధులు నిర్వహిస్తున్నారు పాత నేరస్థుల నివాసాలను కదలికలను ఏవిధంగా గుర్తిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా అక్రమ ఇసుక రవాణా, పిడిఎస్ రైస్, మత్తు పదార్థాల అక్రమ రవాణాను నియంత్రించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ.. వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని అన్నారు. పోలీస్ శాఖ నూతన టెక్నాలజీ అధునాతన టెక్నాలజీ ఉపయోగిస్తున్న దాని గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని, ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో కోస్గి సీఐ, సైదులు, ఎస్సై విజయ్ కుమార్, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## రైతు భరోసా పడిన ఖాతాలను హోల్డ్‌లో పెట్టవద్దు

**కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి**


వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, జూన్ 20 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండల కేంద్రంలోనీ ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్‌కు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హోల్డ్‌లో పెట్టిన రైతుల అకౌంట్లను హోల్డ్‌లో నుంచి తొలగించాలని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్‌తో కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, కల్వకుర్తి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్ రెడ్డిలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు వ్యవసాయ సేద్యానికి ఎలాంటి ఇబ్బందులు ఉండొద్దన్న ఉద్దేశంతో పంటల పెట్టుబడిగా రైతు భరోసా పథకం ద్వారా ఎకరాకు రూ.12వేలు సంవత్సరానికి నిర్ణయించిన వారి అకౌంట్లలో తమ బ్యాంకుల ద్వారా నిధులు వేస్తే మీరు పాత బకాయిల పేరిట వారికి ఇవ్వకుండా రైతుల అకౌంట్లను హోల్డ్‌లో పెట్టడం సరికాదన్నారు. ప్రస్తుత వానకాలం సీజన్ ప్రారంభం కావడంతో పెట్టుబడి డబ్బులు లేక వ్యవసాయం మానేసే పరిస్థితి కొందరికి ఉంటే మరి కొందరు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీకి డబ్బులు తెచ్చుకోని ఇబ్బందుల పాలవుతున్నారని అన్నారు. ఇలా అయితే వ్యవసాయ రంగం అభివృద్ధి ఎలా చెందుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమం కోరే పార్టీ కాంగ్రెస్ పార్టీ కాబట్టి రైతులను అప్పుల పాలు చెయ్యొద్దనే ఉద్దేశంతో రైతులకు నేరుగా అకౌంట్ల ద్వారా నిధులు ఇస్తూ ఉంటే బ్యాంకు అధికారులు సహకరించక పోతే ఎలా అంటూ ఇప్పటైన పాత బకాయిల పేరిట అకౌంట్లను హోల్డ్‌లో పెట్టకుండ, పెట్టిన వాటిని హోల్డ్ నుంచి తీసి సకాలంలో రైతులకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ కల్వకుర్తి మండల అధ్యక్షులు బీస బాల్‌రాజు, మార్చాలా గ్రామ పార్టీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, జంగయ్య, పాండు, పవన్ తదితరులు ఉన్నారు.


## కార్మికులపై ఏజెన్సీ వేధింపులు ఆపాలి

**సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి**

**తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్**

**వనపర్తి, జూన్ 20 ప్రభాతవార్త :** వనపర్తి ప్రభుత్వం మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న సెక్యూరిటీ పారిశుద్ధ్య కార్మికులపై రాజ్‌దీప్ ఏజెన్సీ నిర్వాహకుల వేధింపులు ఆపాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ అన్నారు. శుక్రవారం వనపర్తి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పారిశుద్ధ్య సెక్యూరిటీ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలపై తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి సర్వే నిర్వహించారు. సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ పారిశుద్ధ్య సెక్యూరిటీ సూపర్వైజర్ నిర్వహణ కోసం ప్రభుత్వం అనుమతి ఇచ్చిన రాజ్‌దిప్ ఏజెన్సీ కాంట్రాక్టర్ నిర్వాహకులు అక్కడ పనిచేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ కార్మికులపై లేనిపోని ఆరోపణలతో చీటికిమాటికి చిన్న చిన్న పొరపాటులకు కూడా పనిష్మెంట్ పేరుతో రోజుల తరబడి విధులకు రానివ్వకుండా వేధిస్తున్నారని అన్నారు. అంతర్జాతీయ దినోత్సవం మేడే రోజున ప్రభుత్వం వేతనముతో కూడిన లేబర్ హాలిడే ప్రకటించిన నేపథ్యంలో ముందుగానే కళాశాల ప్రిన్సిపల్‌ని కలిసి కార్మికులకు హాలిడే ఇవ్వాలని కోరడం జరిగిందని ప్రిన్సిపల్ హాలిడే ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ మే డే సెలవును ఇవ్వకుండా కార్మికుల వేతనాల్లో కోతలు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో కార్మికులు తీసుకున్న సెలవును కూడా దుమ్మాల పేరుతో ఇష్టారీతిన అడ్డగోలుగా వేతనాల చెల్లింపులో కోతలు పెడుతున్నారని మండిపడ్డారు. కార్మికులను వేధింపులకు గురి చేస్తే సహించేది లేదని అన్నారు. ప్రభుత్వం తక్షణమే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల కార్మికులు వరుణ్, భారతి, రమ్య, మన్నెమ్మ, లావణ్య, శ్రీగంగా, నారమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న దృశ్యం

**నారాయణపేటప్రతినిధి, జూన్ 20 ప్రభాతవార్త:** నారాయ ణపేట పట్టణానికి చెందిన రమాకాంత్ కుమారుడుకి అనారోగ్యం కారణం వల్ల బాధపడుతున్నందున వారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు ద్వారా రూ. 10500లు రావడం జరిగింది. బిజెపి నాయకుల ఆధ్వర్యంలో లబ్ధిదారునికి చెక్కును శుక్రవారం రోజు అందించడం జరిగింది. కార్యక్రమంలో బిజెపి లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజి, జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురామయ్య గౌడ్, పట్టణ ప్రధానకార్యదర్శి నక్కసత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ గోపాల్ పాల్గొన్నారు. చెక్ రావడంలో అన్ని విధాలుగా సహకరించిన కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

## రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు

**వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్**

**వనపర్తి, జూన్ 20 ప్రభాతవార్త :** రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు చక చక జమవుతున్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 16వ తేదీన రాష్ట్ర ముఖ్య మంత్రి హైదరాబాద్ నుండి రైతు నేస్తం కార్యక్రమం సందర్భంగా కంప్యూటర్ మీట నొక్కి రాష్ట్రంలోని రైతులకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా విడుదల చేశారు. జూన్ 16 నుండి రోజుకు కొంత మంది రైతులకు ఎకరాల చొప్పున రైతు భరోసా జమ చేస్తున్నట్లు తెలిపారు. సమయానికి రైతులకు పెట్టుబడి సాయంగా ప్రభుత్వం రైతు భరోసా ఖాతాల్లో జమ చేయడం పై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. శుక్రవారం నాడు వనపర్తి జిల్లాలో అయిదు ఎకరాల వరకు ఉన్న 11476 మంది రైతుల ఖాతాల్లో రూ. 30,05,62,758/లు జమ చేసినట్లు తెలియజేశారు. కొత్తగా పట్టాదారు పాసు పుస్తకం పొందిన రైతులు, ఇప్పటి వరకు రైతు భరోసా పొందని రైతులు సంబంధిత వ్యవసాయ విస్తీర్ణాధికారిని సంప్రదించాలని కోరారు.

## పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి

**డ్రై డే ఫ్రై డే భాగంగా ప్రజలకు అవగాహన**


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

**వనపర్తి ప్రతినిధి, జూన్ 20 ప్రభాతవార్త:** వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్‌లో డ్రై డే ఫ్రై డే లో భాగంగా శుక్రవారం పరిసరాల పరిశుభ్రత పై మున్సిపల్ వార్డు అధికారులు, ఆశ కార్యకర్తలు, అంగన్వాడి కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో ఇంటి కప్పు పై, పాత టైర్లు, పాత బకెట్లు, సీసా మూతలు, మూతల్లేని ట్యాంకుల్లో నిలువ నీరు లేకుండా చూసుకోవాలని ప్రజలకు అర్థమయ్యే విధంగా ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించారు. పరిశుభ్రత పాటించపోతే దోమలు ప్రబలి డెంగ్యూ, చికన్ గునియా వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంటుందని తెలిపారు. ఇలాంటి ప్రాంతాల్లో పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డు అధికారులు చంద్రకాంత్, గంగాధర్, వినయ్, ఆకాష్, శిల్ప, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

